వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం
- అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం
- ఇది ముస్లిం, రాజ్యాంగ వ్యతిరేక బిల్లు అని ప్రతిపక్షాల ఆగ్రహం
- బిల్లుతో లౌకిక స్ఫూర్తికి విఘాతం
- తక్షణమే ఉపసంహరించుకోవాలి
- బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి

న్యూఢిల్లీ/ హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): దాదాపు 13 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం రాజ్యసభ ఆమోదం తెలియజేయడంతో వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు- 2025 శుక్రవారం పార్లమెంట్ ఆమోదం పొందింది. బిల్లుపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాద ప్రతివాదనలు జరిగాయి. ప్రతిపక్షాలు దీన్ని ముస్లిం వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించాయి. ముస్లింలకు చెందిన ఆస్తులను చేజిక్కించుకుని వాటిని కార్పొరేషన్లకు అప్పగించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని ఆరోపించాయి. బిల్లుతో లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని, తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. దురుద్దేశంతోనే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని, దీన్ని ఉపసంహరించాలని కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, శివసేన(యూబీటీ)తోపాటు, ఇతర ప్రతిపక్షాలు డిమాండు చేశాయి. 128 మంది సభ్యులు అనుకూలంగా, 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేయడంతో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందింది. గురువారమే ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు, 2025కి కూడా రాజ్యసభ శుక్రవారం ఆమోదం తెలిపింది.

కొద్దిమంది ముస్లిమేతరులు ఉన్నంత మాత్రాన..

బిల్లుపై చర్చ సందర్భంగా మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రసంగిస్తూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు బిల్లుపై ముస్లిం సమాజాన్ని భయపెడుతున్నాయని ఆరోపించారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ లక్ష్యంతో అన్ని వర్గాల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. వక్ఫ్ బోర్డు ఓ చట్టబద్ధ సంస్థని, అన్ని ప్రభుత్వ సంస్థల మాదిరిగానే అది కూడా లౌకికవాదంతో పనిచేయాలని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డులో కొద్ది మంది ముస్లిమేతరులు ఉన్నంత మాత్రాన బోర్డు నిర్ణయాల్లో మార్పులు జరగబోవని, పైగా వాటికి విలువ చేకూరుతుందని రిజిజు చెప్పారు. ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లులో జేపీసీ, ఇతర భాగస్వాములు చేసిన అనేక సూచనలను చేర్చామని ఆయన తెలిపారు.

వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు..

వక్ఫ్ సవరణ బిల్లును సవాలు చేస్తూ ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావేద్ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు, 2025పై రాష్ట్రపతి సంతకం చేయవలసి ఉంది. ముస్లింలు, ముస్లిం సమాజానికి చెందిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా వక్ఫ్ బిల్లులోని నిబంధనలను ఒవైసీ తన పిటిషన్‌లో అభివర్ణించారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

బడ్జెట్ సమావేశాలకు తెరదించుతూ పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. జనవరి 31న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి.

మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ: సురేశ్‌రెడ్డి

వక్ఫ్ బిల్లుపై దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నదని రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత, ఎంపీ సురేశ్‌రెడ్డి చెప్పారు. ఈ బిల్లు కొన్ని వర్గాలకు నష్టం చేస్తుందన్నారు. బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ అభివృద్ధి ముసుగులో ఒక వర్గాన్ని ఏకం చేసే కుట్రకు కేంద్రం తెరలేపిందన్నారు. ఈ బిల్లుపై దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర ప్రాంతాల్లోని వక్ఫ్ బోర్డు బాధ్యులను చర్చలకు పిలిచి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బిల్లులో సంస్కరణలు చేయాలని సూచించారు. లేకపోతే భారత లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఓ సీఎం సర్వే నిర్వహించి విద్యుత్తు, దేవాదాయ శాఖల్లో తీవ్రమైన అవినీతి ఉందని గుర్తించారని తెలిపారు. తదనంతరం అవినీతిని అరికట్టేందుకు పాలనా పరమైన సంస్కరణలు తెచ్చారని చెప్పారు. అదే తరహాలో మైనారిటీల్లో కూడా సంస్కరణలు తేవాలని ఆశిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే ముస్లింల జనాభా అధికంగా ఉండే ప్రాంతాల్లో మత ఘర్షణలు, అల్లర్లు జరుగుతాయని అప్పటి సీమాంధ్ర పాలకులు చెప్పారన్నారు. అయితే కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో ఒక్కటంటే ఒక్క మత ఘర్షణ జరగలేదని, తెలంగాణ లౌకికంగా, ప్రజాస్వామికంగా ఫరిఢవిల్లిందని చెప్పారు. తెలంగాణ కోసం హిందువులు, ముస్లింలు ఏకమై పోరాడినట్లు గుర్తు చేశారు. తెలంగాణలో దర్గాలకు ముస్లింలు 45 శాతం మంది వెళ్తే.. హిందువులు 55 శాతం మంది వెళ్తారని తెలిపారు. తమ పిల్లలకు పెండ్లిళ్లు కావాలని ప్రార్థిస్తుంటారని పేర్కొన్నారు. ఇప్పుడు వక్ఫ్ బిల్లు తేవడం ద్వారా హిందూ ముస్లింల మధ్య ఐక్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ముస్లింల దర్గాలకు హిందువులే సాదా బైనామాపై స్థలాలను రాసిచ్చేవారని చెప్పారు. అదానీ వంటి పారిశ్రామిక వేత్తలు దర్గాలను సందర్శిస్తే.. వారిచ్చే విరాళాలతో దర్గాలు అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని, అయితే ఈ వక్ఫ్ బిల్లుతో విరాళాలు ఇచ్చేందుకు వెనుకాడే పరిస్థితి ఉండొచ్చని తెలిపారు. కేంద్రం వెంటనే ఈ వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు.

నా చావుకు కాంగ్రెస్ నేతలే కారణం

- వాట్సాప్‌లో వ్యాఖ్యలు చేసినందుకు నన్ను అక్రమంగా అరెస్ట్ చేయించారు
- వేధింపులు తట్టుకోలేకున్నా
- బెంగళూరులో యువకుడి బలవన్మరణం

బెంగళూరు, ఏప్రిల్ 4: 'కాంగ్రెస్ నేతల వేధింపులు తట్టుకోలేక పోతున్నా. నన్ను క్రిమినల్‌గా చిత్రీకరించి, నా జీవితాన్ని నాశనం చేశారు. వాళ్లు నాపై రౌడీషీట్ తెరవడానికి ప్రయత్నించారు. ఈ అవమానాలు ఇంక భరించ లేను. నా చావుకు కాంగ్రెస్ నేతలే కారణం. వారి వేధింపుల కారణంగానే నేను ప్రాణం తీసుకుంటున్నా. నా చావు గుణపాఠం కావాలి' అని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం బెంగళూరులో సంచలనం కలిగించింది. దీనిపై డీసీపీ స్థాయి అధికారితో విచారణ జరిపిస్తానని హోం మంత్రి పరమేశ్వర హామీనిచ్చారు. 35 ఏండ్ల వినయ్ సోమయ్య శుక్రవారం బెంగళూరులోని నగవార ప్రాంతంలోని తన ఆఫీస్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు బీజేపీ సానుభూతిపరుడిగా గుర్తించారు. అతడి సూసైడ్ ప్రకారం.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య న్యాయ సలహాదారు, విరాజ్‌పేట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే పొన్నన్నపై వినయ్ సోమయ్య రెండు నెలల క్రితం వాట్సాప్‌లో కొన్ని వ్యాఖ్యలు చేశాడు. దీనిపై కాంగ్రెస్ నేత మహీనా.. మడికేరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అతడిని అరెస్ట్ చేశారు. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా తనను కాంగ్రెస్ నేతలు రాజకీయంగా టార్గెట్ చేశారని, దీని కారణంగా తన కుటుంబం అనేక అవమానాలను ఎదుర్కొందని వినయ్ తెలిపాడు. తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న వారందరిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరాడు. కాగా, ఆ ఘటనపై డీసీపీతో దర్యాప్తు చేయిస్తానని హోం మంత్రి జీ పరమేశ్వర హామీనిచ్చారు.

ఎఫ్ఐఆర్‌లో ఎమ్మెల్యే ప్రస్తావనే లేదు

మృతుని సోదరుడు జీవన్ కేఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెన్నూర్ పోలీసులు తెలిపారు. అయితే ఎఫ్ఐఆర్‌లో పొన్నన్న, మడికేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే మంతర్ గౌడ పేర్లను ప్రస్తావించ లేదు.

వక్ఫ్ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ కోల్‌కతాలో వివిధ ముస్లిం సంఘాల నిరసన

వక్ఫ్ బిల్లుపై నిరసనల హోరు

బెంగాల్, తమిళనాడు, గుజరాత్‌లో ముస్లింల ఆందోళనలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆమోదించిన వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసనలు వెల్లువెత్తాయి. గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పెద్ద ఎత్తున ముస్లింలు ఆందోళనకు దిగారు. కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్‌తోసహా పలు నగరాల్లో వేలాది ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం రోడ్లపైకి వచ్చారు. వక్ఫ్ బిల్లును తిరస్కరిస్తున్నామన్న నినాదాలు గల ప్లకార్డులు చేతపట్టుకుని జాతీయ జెండాలు ఊపుతూ కోల్‌కతా నగర వీధులలో భారీ సంఖ్యలో ప్రజలు నిరసనలు తెలిపారు. ఈ నిరసనలను వక్ఫ్ పరిరక్షణ కోసం ఏర్పడిన సంయుక్త వేదిక నిర్వహించినట్టు వార్తా సంస్థలు తెలిపాయి.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాం

- పార్లమెంట్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ను ఎండగట్టాం
- రాష్ట్రంలో అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన
- బీఆర్ఎస్ నేతలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): మోదీ సర్కారు తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మొదటి నుంచి బీఆర్ఎస్ ముస్లింల మనోభావాలను గౌరవిస్తున్నదని చెప్పారు. భవిష్యత్తులోనూ ఇదే పంథాలో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ బలం తక్కువగా ఉన్నప్పటికీ ప్రజాపోరాటంలో ముందున్నామని అన్నారు. ముస్లింలతోపాటు అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతున్న బీజేపీని పార్లమెంట్‌లో నిలువరించామని చెప్పారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో దుర్మార్గపు పాలన సాగిస్తున్నదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను విస్మరించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులపై దాడులకు దిగుతున్నదని ధ్వజమెత్తారు. హెచ్‌సీయూలో జరిగిన అమానవీయ ఘటనలు, హైడ్రా ఆగడాలను రాజ్యసభలో చర్చకు తెచ్చామని చెప్పారు. అభివృద్ధి కోసం భూములను అమ్మడం సహజమేనని, కానీ ఎలాంటి భూములను అమ్మాలో నిర్ణయించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేని భూములను వేలం వేశారని, ఏనాడూ యూనివర్సిటీ భూముల జోలికి పోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తూ విలువైన స్థలాలను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని అన్నారు.

ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్ రెడ్డి, పక్కన రవిచంద్ర

శక్తివంతమైన పాస్‌పోర్టుల్లో దిగజారిన భారత్

న్యూఢిల్లీ: ప్రపంచంలో శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత ర్యాంకు మరింత దిగజారింది. నిరుడు 147వ ర్యాంకు ఉండగా, ఈ ఏడాది 148వ ర్యాంకుకు పడిపోయింది. 199 దేశాలతో రూపొందించిన నొమడ్ క్యాపిటలిస్ట్ పాస్‌పోర్ట్ సూచీ-2025లో ఉత్తర యూరప్ దేశం ఐర్లాండ్ అగ్రస్థానంలో నిలిచింది. వీసా రహిత ప్రయాణం (50%), పన్ను విధింపు (20%), ప్రపంచ దృక్కోణం (10%), ద్వంద్వ పౌరసత్వం(10%), వ్యక్తిగత స్వేచ్ఛ (10%) పరామితుల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. తాజా ర్యాంకింగ్స్‌లో స్విట్జర్లాండ్, గ్రీస్ రెండో ర్యాంక్‌లో, అమెరికా 45వ స్థానంలో నిలిచాయి.

ఇప్పటివరకు 682 మంది వెనక్కి

అమెరికా బహిష్కరణపై కేంద్రం

న్యూఢిల్లీ: ఈ సంవత్సరంలో ఏప్రిల్ 4 వరకు మొత్తం 682 మంది భారతీయులను అమెరికా దేశం నుంచి బహిష్కరించిందని విదేశాంగ శాఖ శుక్రవారం పార్లమెంట్‌లో వెల్లడించింది. వీరిలో ఎక్కువ మంది అక్రమంగా అగ్రరాజ్యంలోకి ప్రవేశించిన వారేనని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. అమెరికాలో భారతీయుల అక్రమ వలసలకు సహకరిస్తున్న ఏజెంట్లు, ఇతర నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. అమెరికాలోకి ఎంతమంది భారతీయులు అక్రమంగా ప్రవేశించారనే సమాచారం తమ వద్ద ఉండదని.. అమెరికా వద్దే ఉంటుందని వెల్లడించారు. అమెరికా బహిష్కరించే భారతీయుల వివరాలను సంబంధిత భారత ప్రభుత్వ విభాగాలు నిశితంగా పరిశీలించి.. వారు భారతీయులైతేనే స్వదేశానికి అనుమతిస్తాయని కీర్తివర్ధన్ చెప్పారు.

డ్యాన్స్ చేస్తూ గుండెపోటుకు గురై

యూపీలో వ్యాపారి మృతి

బరేలీ: తన 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భార్యతో కలసి నృత్యం చేస్తూ ఓ 45 ఏళ్ల చెప్పుల వ్యాపారి హఠాత్తుగా గుండెపోటుకు గురై మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో బుధవారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. షాహాబాద్ ప్రాంతంలోని ఓ వివాహ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు సమావేశమయ్యారు. రెండు నిమిషాల పాటు వాసిం తన భార్యతో కలసి నృత్యం చేయడం ఓ వీడియోలో కనిపించింది. నృత్యం ఆపి పక్కకు వచ్చిన అతను హఠాత్తుగా కుప్పకూలిపోయాడు.

నేపాల్‌లో భూకంపం.. ఢిల్లీలోనూ ప్రకంపనలు

కాఠ్‌మాండూ, ఏప్రిల్ 4: పెను భూకంప విలయం నుంచి మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలు తేరుకోకముందే తాజాగా శుక్రవారం రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో నేపాల్‌లో భూకంపం సంభవించింది. దీని ప్రభావం భారత్‌లోని ఉత్తర ప్రాంతంపై కూడా పడింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ రీజియన్‌లో కూడా ప్రకంపనలు సంభవించినట్టు అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం నేపాల్‌లో రాత్రి 7.52 గంటలకు భూకంపం సంభవించగా, 20 కి.మీ లోతున దీని కేంద్రం ఉన్నట్టు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించింది.

తమిళనాడు నీట్ వ్యతిరేక బిల్లును తిరస్కరించిన రాష్ట్రపతి

చెన్నై: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన నీట్ నుంచి మినహాయింపు కోరుతూ తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి తిరస్కరించారు. ఈ విషయాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. అయినప్పటికీ నీట్‌ను రద్దు చేయాలంటూ తాము చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై చర్చించేందుకు ఈ నెల 9న రాష్ట్రంలోని అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. నీట్‌పై తమిళనాడు అసెంబ్లీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించడాన్ని 'సమాఖ్యవాదంలో చీకటి అధ్యాయం'గా ఆయన అభివర్ణించారు. తమిళనాడు ప్రజల ఆకాంక్షల పట్ల, తమిళనాడు అసెంబ్లీ చేసిన విజ్ఞప్తిపై కేంద్రం అమర్యాదకరంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు.

కేరళ సీఎం కుమార్తెకు బిగుస్తున్న ఉచ్చు

అవినీతి కేసులో విచారణకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఆర్థిక నేరం ఆరోపణల కేసులో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఉచ్చు బిగుస్తున్నది. కొచ్చి మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్)-ఎక్సలాజిక్ కంపెనీల ఆర్థిక నేరం కేసులో ఆమెను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. సీఎంఆర్ఎల్ నుంచి ఆమె కంపెనీ నెలవారీ మొత్తాలు అక్రమంగా అందుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) దాఖలు చేసిన చార్జిషీట్ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఈ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వీణాకు చెందిన ఎక్సలాజిక్ కంపెనీ.. సీఎంఆర్ఎల్ అనే మరో కంపెనీ నుంచి ఎలాంటి సేవలు అందించకుండానే అక్రమంగా 2.7 కోట్ల రూపాయలను పొందింది. ఆర్థిక నేరం ఆరోపణలపై ఇప్పటికే ప్రత్యేక కోర్టులోఆమెపై కేసు ఫైల్ అయ్యింది. ఆర్థిక నేరం కేసులో తన కుమార్తెపై కేసు నమోదైనందున ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని కేరళ ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ డిమాండ్ చేశారు.

దుకాణాలే నడుపుదామా?

- చైనా స్టార్టప్‌లు పరిజ్ఞానంపై దృష్టి పెడుతుండగా..భారత్‌లో చీప్ లేబర్‌ను తయారు చేస్తున్నాం
- స్టార్టప్‌లపై కేంద్రమంత్రి గోయల్ అసంతృప్తి
- తీవ్రంగా తప్పబట్టిన కేటీఆర్, జెప్టో సీఈవో ఆదిక్ పలీచా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: చైనాలో ఔత్సాహిక పారిశ్రామికులు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ పరిజ్ఞానం, సెమికండక్టర్లు, కృత్రిమ మేధపై పని చేస్తుండగా, భారత్‌లో అనేక స్టార్టప్‌లు ఆహార పదార్థాల డెలివరీ, బెట్టింగ్, స్పోర్ట్స్, గేమ్స్ యాప్‌లపై దృష్టి పెట్టాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన స్టార్టప్ మహాకుంభ్‌లో ఆయన మాట్లాడారు. తక్కువ ఆదాయం వచ్చే చిల్లర వ్యాపారాలతోనే సంతృప్తి చెందుతారా అని ఆయన ప్రశ్నించారు. 'ఐస్‌క్రీమ్‌లు లేదా చిప్స్ తయారు చేద్దామా? దుకాణ్‌దారీ హీ కర్నా హై? (దుకాణాలే నడుపుదామా)?' అని పేర్కొన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 100కు పైగా యూనికార్న్‌లతో భారత్ మూడో అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ఉంది. సుమారు 1.57 లక్షల స్టార్టప్‌లు ప్రభుత్వ గుర్తింపు పొందాయి. స్టార్టప్‌లు తాము నిర్దేశించుకున్న లక్ష్యంపై పునరాలోచన చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. డెలివరీ బాయ్స్, గర్ల్స్‌గా ఉండిపోదామా? భారతదేశపు గమ్యం ఇదేనా? అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. 'నేడు భారత్‌లోని స్టార్టప్‌లు ఏం చేస్తున్నాయి? ఫుడ్ డెలివరీ యాప్‌లపై దృష్టి పెడుతున్నాం. సంపన్నులు ఇంట్లో నుంచి కాలు బయట పెట్టకుండా ఇంటికే తమ భోజనం తెప్పించుకునేలా నిరుద్యోగ యువతను చౌకగా వచ్చే కార్మికులుగా మార్చేస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. కేవలం రూ.25 లక్షలకో లేదా రూ.50 లక్షలకో ఓ స్టార్టప్ ఆలోచనను విదేశీ కంపెనీలకు అమ్ముకున్నారని విన్నప్పుడు చాలా బాధ కలుగుతుందని చెప్పారు.

భారత స్టార్టప్‌లు వినూత్నం: కేటీఆర్

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్టార్టప్‌లపై చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. గోయల్ వ్యాఖ్యలతో తాను ఏకీభవించడం లేదన్నారు. భారతీయ స్టార్టప్‌లు చాలా వినూత్నమైనవని కొనియాడారు. మనకు అంతరిక్ష సాంకేతికత నుంచి ఫిన్ టెక్, రోబోటిక్స్ వరకు అనేక రకాల స్టార్టప్‌లు ఉన్నాయని గుర్తు చేశారు. మన పురాతన చట్టాలు, సుంకాలు, నిబంధనలు విధించిన అన్ని అడ్డంకులను అధిగమించి అవి బాగా పనిచేశాయని స్పష్టం చేశారు. మంత్రి వ్యాఖ్యలను జెప్టో సీఈవో ఆదిక్ పలీచా, ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ మోహన్‌దాస్ పాయ్ తప్పుపట్టారు. ప్రభుత్వం 'స్థానిక చాంపియన్లను' సృష్టించేందుకు మద్దతునివ్వాలని, వారికి సహకరిస్తున్న సంస్థలను నిరుత్సాహపరచకూడదని అన్నారు.

బంగ్లాలో మైనారిటీలకు రక్షణ కల్పించండి

యూనస్‌కు మోదీ సూచన

బ్యాంకాక్, ఏప్రిల్ 4: బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌తో ప్రధాని మోదీ మొదటిసారి భేటీ అయ్యారు. బంగ్లాదేశ్‌లో హిందువులతోసహా మైనారిటీల భద్రతపై ఆందోళన వ్యక్తంచేశారు. మైనార్టీలకు రక్షణ కల్పించాలని కోరారు. బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొనేందుకు హాజరైన ఇద్దరు నేతలు విడిగా సమావేశమై 40 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీల, సమీకృత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని మోదీ తెలిపారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత, సరిహద్దుల్లో జరుగుతున్న హత్యలపై యూనస్ తన ఆందోళనను మోదీకి తెలియచేశారు.

ఇదిగో గోల్డ్ కార్డ్

- ఫస్ట్ లుక్ విడుదల చేసిన ట్రంప్
- పౌరసత్వం పొందేందుకు వీలు

వాషింగ్టన్: అమెరికా పౌరసత్వానికి వీలు కల్పించే గోల్డ్ కార్డును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఆవిష్కరించారు. తానే తొలి కొనుగోలుదారుడినని పేర్కొన్నారు. 35 ఏండ్ల క్రితం ప్రవేశపెట్టిన ఈబీ-5 ఇన్వెస్టర్ వీసాల స్థానంలో వీటిని తీసుకొచ్చారు. 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.43 కోట్లు) చెల్లించి ఈ కార్డును పొందొచ్చని ట్రంప్ వెల్లడించారు. ఈ కార్డుల అమ్మకం ద్వారా తమ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠ పరచాలని యూఎస్ అధికారులు భావిస్తున్నారు. అర్హత కలిగిన విదేశీయులకు ఈ కార్డులను అమ్మడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని వారు భావిస్తున్నారు. ఈ గోల్డ్ కార్డు వెంటనే అమెరికా పౌరసత్వాన్ని కల్పించకపోయినప్పటికీ.. దాన్ని పొందేందుకు మార్గాన్ని ఏర్పరుస్తుంది. 'ఇది గ్రీన్ కార్డ్ అందించే ప్రయోజనాలను కల్పించడంతో పాటు పౌరసత్వానికి మార్గం అవుతుంది' అని ట్రంప్ మీడియాతో అన్నారు.

నరకం చూపించిన భార్య నుంచి విముక్తి

- 47 ఎఫ్ఐఆర్‌లు, చిత్రహింసలను తట్టుకున్న భర్త
- భార్యకు రూ.63 లక్షల భరణం చెల్లింపునకు హైకోర్టు ఆదేశం

భువనేశ్వర్, ఏప్రిల్ 4: భార్య చేతుల్లో దాదాపు 15 ఏండ్ల పాటు చిత్రహింసలు అనుభవించిన ఓ భర్తకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఒడిశాకు చెందిన ఆ వ్యక్తికి 2003 మే 11న వివాహమైంది. ఇక అప్పటి నుంచి మూడు కేసులు, ఆరు వేధింపులు అన్నట్టుగా సంసారం సాగింది. అతడిపై భార్య 47 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసింది. ఆత్మహత్య చేసుకుంటానంటూ పదేపదే బెదిరింపులకు దిగింది. చివరకు విడాకులతో కథ సుఖాంతమైంది. భార్యకు అమెరికాలోని న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎంఎస్‌సీ డిగ్రీ లభించేందుకు అండగా నిలబడిన ఆ భర్తకు చివరకు మానసిక ఆరోగ్యం దెబ్బతిన డంతో టీసీఎస్‌లో చేస్తున్న ఉద్యోగం కూడా వదులుకోవలసి వచ్చింది. ఉద్యోగ రీత్యా కోల్‌కతా, భువనేశ్వర్, థాయ్‌లాండ్, జపాన్, అమెరికా సహా అనేక చోట్ల నివసించే టప్పుడు అతనికి అక్కడ కూడా భార్య నుంచి వేధింపులు, బెదిరింపులు తప్పలేదు. భార్య పెట్టే చిత్రహింసలు భరించలేక 2009లో అతను విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా భర్తతోనే జీవిస్తానంటూ ఆమె కోర్టుకు తెగేసి చెప్పింది.కటక్ ఫ్యామిలీ కోర్టు, ఒడిశా హైకోర్టు ఎట్టకేలకు ఆ భర్తకు విడాకులు మంజూరుచేసి మనోవర్తి కింద ఆమెకు రూ.63 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది.

ఆధార్‌కు ఏఐ నకిలీ మకిలి

- చాట్‌జీపీటీతో ఫేక్ ఆధార్, పాన్ కార్డుల సృష్టి
- ఏఐ దుర్వినియోగంపై నెటిజన్ల ఆందోళన
- వాడకంపై నియంత్రణ విధించాలని డిమాండ్

న్యూఢిల్లీ: టెక్నాలజీ అనేది రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. ఇది సమాజానికి ఎంత మేలు చేస్తోందో అంతే కీడూ కలిగిస్త